సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025



టన్ను చీనీ రూ.21 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.21 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.22

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.22. కనిష్టం రూ.14 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
33.4°/20.7°

జిల్లా పరిధిలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఐదు మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని ఐదు మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకూ గోరంట్ల మండలంలో 34.4 మి.మీ, రొద్దం 8.4, పుట్టపర్తి 6.8, సోమందేపల్లిలో 5.8, ఓడీ చెరువులో 4.2 మి.మీ నమోదైందన్నారు. జిల్లా మొత్తం 59.6 మి.మీ వర్షం పడిందన్నారు. ఉద్యాన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకొని పంటలను కాపాడుకోవాలన్నారు. తోటల్లో వర్షపు నీరు నిలబడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ సూచించారు.

ఉమ్మడి జిల్లాకు వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: రాగల ఐదు రోజులు ఉమ్మడి అనంతపురం జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణశాఖ, విశాఖ కేంద్రం నుంచి అందిన సమాచారం మేరకు ఈనెల 24వ తేదీన 6.8 మి.మీ, 25న 3 మి.మీ, 26న 2.8 మి.మీ, 27న 15 మి.మీ, 28న 3.2 మి.మీ సగటు వర్షపాతం నమోదు కావొచ్చన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 32.8- 30 డిగ్రీల మధ్య, కనిష్ట ఉష్ణోగ్రతలు 23.4- 22 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందన్నారు. గంటకు 10 నుంచి 13 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచే అవకాశం ఉందని వెల్లడించారు.

పోలీసుల సంక్షేమానికి కృషి



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న పోలీసు అధికారుల సంఘం అడహాక్ సభ్యులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో పోలీసు సిబ్బంది సంక్షేమం, అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. మంగళవారం పోలీసు అధికారుల సంఘం అడహాక్ సభ్యులు ఎస్పీ చాంబర్‌లో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పోలీసుల ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సంక్షేమం గురించి ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎస్పీని కలసిన వారిలో పోలీస్ అధికారుల సంఘం అడహాక్ రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, ఉమ్మడి జిల్లాల పోలీస్ అసోసియేషన్ సభ్యులు త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, దాదాపీర్, సరోజమ్మ తదితరులు ఉన్నారు.

• జగజ్జననీ నమోస్తుతే !

సాక్షిబృందం: నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి ఆయా ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



లక్ష్మీదేవిగా రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మి



హిందూపురం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు




కదిరి: మహాలక్ష్మిగా దర్శనమిస్తున్న వాసవీమాత



ధర్మవరం: శాకంబరి అలంకరణలో అంబా భవాని

భవిత అంధకారం



- ఫీజు బకాయిల విడుదల Z కూటమి తాత్సారం
- విద్యార్థుల్లో అయోమయం
- అష్టకష్టాలు పడుతున్న తల్లిదండ్రులు
- అక్టోబర్‌లో కళాశాలల మూత దిశగా యాజమాన్యాలు



అనంతపురం: చంద్రబాబు సర్కారు విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపై మీనమేషాలు లెక్కిస్తూ వారి జీవితాలతో చెలగాటమాడుతోంది. వాస్తవానికి గడిచిన విద్యా సంవత్సరంలో చివరి రెండు త్రైమాసికాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన జూన్ నెలలో చెల్లించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మళ్లీ వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చి ఉంటే ఆ నిధులు విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లోకి జమయ్యేవి. కానీ, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులను విడుదల చేయకుండా నిలిపివేసింది. పాత విద్యా సంవత్సరంలో రెండు త్రైమాసికాలు, ఈ విద్యా సంవత్సరంలో పూర్తయిన మూడు త్రైమాసికాలకు కలిపి రూ. 90 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి పెట్టింది. వైఎస్సార్‌సీపీ 'యువత పోరుబాట' నిర్వహించడంతో ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక త్రైమాసికానికి సంబంధించి రూ.30 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించినా, ఇప్పటి వరకు పాక్షిక చెల్లింపులు మాత్రమే జరిగాయి.

పాత బకాయిలూ ఇచ్చి..

2019 మేలో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కారు తమ హయాంలో రాజకీయాలకు అతీతంగా అండగా నిలిచింది. 2017–19 మధ్య టీడీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిలను సైతం చెల్లించింది. ఐదేళ్లలో ప్రతి త్రైమాసికం పూర్తికాగానే తల్లుల ఖాతాలో నగదు జమ చేసింది. కానీ కూటమి సర్కారు నిధులను విడుదల చేయకపోగా.. అప్పట్లో అమలైన 'వసతి దీవెన' పథకానికి కూడా మంగళం పాడింది. ప్రైవేట్ కళాశాలల్లో పీజీ చదువుతున్నవారికి సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తామని ఎన్నికల ముందు టీడీపీ నాయకులు పలికిన ప్రగల్భాలను నమ్మి ప్రైవేట్ కళాశాలల్లో చేరినవారి నెత్తిన పిడుగు పడినట్టయింది.

తాకట్టు పెట్టి డబ్బు..

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఉన్నత విద్య, ఉద్యోగాల సమయంలో సర్టిఫికెట్లు తప్పనిసరి కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారి తల్లిదండ్రులు ఇళ్లు, పొలాలు, పుస్తెలు తాకట్టు పెట్టి మరీ అప్పులు తెచ్చి ఫీజులు చెల్లిస్తున్న దుర్భర పరిస్థితి కనిపిస్తోంది. పేదింటి విద్యార్థులను అత్యున్నత ప్రమాణాలు కలిగిన కళాశాలల్లో చదివించి వారి భవిష్యత్తుకు జగన్ ప్రభుత్వం ఉజ్వల బాటలు వేయగా.. తాజాగా కూటమి ప్రభుత్వంలో 2014–19 నాటి పరిస్థితులే పునరావృతం అవుతున్నాయి. అప్పట్లో సరిగా ఫీజులు కట్టకపోతే విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వని పరిస్థితి నెలకొనగా.. తాజాగా అదే పరిస్థితి కనిపిస్తోంది.

మూసివేత.. ఇంతకంటే దౌర్భాగ్యం ఉంటుందా?

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల పరిస్థితి దయనీయంగా మారింది. సిబ్బందికి వేతనాలు, కళాశాలల నిర్వహణ ఖర్చులు భరించలేని స్థితిలో యాజమాన్యాలు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఏకంగా కళాశాలలను మూసివేయాలని నిర్ణయించడం గమనార్హం. ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఈ మేరకు నోటీసు ఇవ్వడం రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి కావడం కూటమి ప్రభుత్వ అధ్వాన పాలనకు నిదర్శనంగా నిలుస్తోంది. వాస్తవానికి ఈ నెల 22 నుంచి కళాశాలలు మూసివేయాలని నిర్ణయించినప్పటికీ, దసరా సెలవులు కావడంతో నిర్ణయాన్ని వాయిదా వేశారు. డిగ్రీ మొదటి సంవత్సరం రెండు, మూడో దఫా కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత అక్టోబర్ మొదటి వారంలో డిగ్రీ కళాశాలలు మూసివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

2019-20 నుంచి 2023-24 వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం ఇలా...

విద్యా సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	45,491	103.73
2020-21	50,571	83.78
2021-22	50,702	100.53
2022-23	42,915	105.43
2023-24	40,006	28.08
2024-25	42,000	రెండు త్రైమాసికాలు ఇవ్వాల్సి ఉంది

వసతి దీవెన

విద్యా సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	45491	42.37
2020-21	50,571	47.96
2021-22	50,702	45.25
2022-23	42,915	37.46
2023-24	40,006	00.00

బస్సుల్లో వస్తేనే నియామక పత్రాలు

- డీఎస్సీ–25 అభ్యర్థులపై తీవ్ర ఒత్తిళ్లు



అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ–25కు ఎంపికైన అభ్యర్థులకు రేపు (25న) అమరావతిలో నియామక ఉత్తర్వులు అందజేయనున్నారు. అయితే అమరావతికి వ్యక్తిగతంగా వెళ్లేందుకు అనుమతించడం లేదు. తప్పనిసరిగా అధికారులు ఏర్పాటు చేసిన బస్సుల్లోనే రావాలని తీవ్ర ఒత్తిళ్లు చేస్తుండడంతో అభ్యర్థులు బెంబేలెత్తుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగతంగా ఇతర వాహనాల్లో ప్రయాణాలు అనుమతించబోమని, తప్పనిసరిగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సుల్లోనే రావాలంటూ విద్యాశాఖ అధికారులు మెసేజ్‌లు చేశారు. బస్సుల్లో వచ్చిన వారికి మాత్రమే అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇస్తామంటూ బెదిరింపు ధోరణిలో మెసేజ్‌లు పెట్టారని అభ్యర్థులు వాపోతున్నారు. తాము అంతదూరం బస్సుల్లో ప్రయాణం చేయలేమని రైళ్ల లేదా వ్యక్తిగత వాహనాల్లో వస్తామంటే కుదరదని అధికారులు తెగేసి చెప్పారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుండి ఎంపికైన అభ్యర్థులు బుధవారం ఉదయం 6 గంటలకు అనంతపురం రూరల్ ఆలమూరు రోడ్డులోని బాలాజీ కళాశాల వద్దకు చేరుకోవాలని సూచించారు. ప్రతి అభ్యర్థీ తన కుటుంబ సభ్యులు లేదా బంధువులలో ఆరోగ్యంగా ఉన్న ఒకరిని తప్పనిసరిగా తోడుకు తెచ్చుకోవాలని, స్త్రీలు అయినా పురుషులైనా అభ్యర్థి ఒక్కరే వస్తే అనుమతించబోమని స్పష్టం చేశారు. కాగా మొత్తం 12 మంది అభ్యర్థులకు బస్సుల నుంచి మినహాయింపు ఇచ్చారు. వీరిలో ఏడుగురు గర్భిణిలు, నలుగురు చిన్నపిల్లల తల్లులు, ఒకరు ఆపరేషన్ చేయించుకున్న అభ్యర్థి ఉన్నారు. వీరందరూ నేరుగా అమరావతికి వ్యక్తిగతంగా రావచ్చని డీఈఓ తెలిపారు.

వేరు'శని'గ



కాయలు లేని వేరుశనగ చెట్లను చూపిస్తున్న రైతు మల్లేశప్ప

ఇక్కడ కనిపిస్తున్న రైతు పేరు మల్లేశప్ప. గుడిబండ మండలం ఫళారం గ్రామం. ఈ రైతు కుటుంబం పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తోంది. ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేశాడు. రెండెకరాల వేరుశనగ సాగుకు రూ.30 వేల వరకూ ఖర్చు చేశాడు. అయితే వేరుశనగ పంట దిగుబడి ఆశించస్థాయిలో లేదు. పెట్టుబడి కూడా గిట్టుబాటుకాని పరిస్థితి. సమయానికి వర్షాలు రాక దిగుబడి రాలేదని, ఈసారి కూడా నిరాశే మిగిలిందని మల్లేశప్ప ఆవేదన వ్యక్తం చేశారు.

- సమయానికి వర్షం రాక తగ్గిన దిగుబడి
- పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటు కాని పరిస్థితి
- తీవ్ర ఆవేదనలో అన్నదాతలు

మడకశిర: ప్రతి ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసి రైతులు నష్టపోతూనే ఉన్నారు. ఈ ఏడాది కూడా వేరుశనగ పంట దిగుబడి అంతంత మాత్రమే ఉండటంతో రైతులు నష్టాల బాట పట్టారు.

తగ్గిన విస్తీర్ణం

మడకశిర వ్యవసాయ డివిజన్ పరిధిలో మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలాలు ఉన్నాయి. ఖరీఫ్‌లో 23,973 హెక్టార్ల విస్తీర్ణంలో వేరుశనగ పంట సాగు కావాలి. అయితే సాగు విస్తీర్ణం సగానికి సగం తగ్గింది. కేవలం 11,480 హెక్టార్ల విస్తీర్ణంలో మాత్రమే వేరుశనగ పంట సాగైంది. సకాలంలో వర్షాలు పడక పోవడం, కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవడంతోనే వేరుశనగ పంట సాగు విస్తీర్ణం తగ్గడానికి కారణంగా మారింది.

ఆర్థిక ఇబ్బందుల్లో అన్నదాతలు

మడకశిర వ్యవసాయ డివిజన్ పరిధిలో పేద రైతులు ఎక్కువ. వీరందరూ ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయం చేయడానికి ప్రభుత్వాలు అందించే పెట్టుబడి సాయంపై ఎక్కువగా ఆధారపడతారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఏడాది క్రమం తప్పకుండా రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించి ఆదుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు పెట్టుబడి సమస్య ప్రారంభమైంది. 2024లో అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇవ్వకపోగా.. ఈ మధ్యనే రూ.20వేలు ఇవ్వాల్సిన చోట కేవలం రూ.5 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంది. అది కూడా సకాలంలో ఇవ్వకపోవడంతో సాగు తగ్గిపోయింది.

పంట దిగుబడి అంతంతమాత్రమే

ప్రస్తుతం సాగు చేసిన వేరుశనగ పంట దిగుబడి అంతంతమాత్రంగానే ఉందని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా ఎకరా వేరుశనగ పంట సాగుకు రైతులు రూ.15 వేల చొప్పున ఖర్చు పెట్టారు. తీరా చూస్తే వేరుశనగ చెట్లలో 10 నుంచి 15 వరకు మాత్రమే కాయలు ఉన్నాయి. కనీసం 25 నుంచి 30 కాయలు ఉంటేనే రైతులకు గిట్టుబాటు అవుతుంది. దీంతో ఎకరాకు 2 క్వింటాళ్ల దిగుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఎకరాకు రూ.10 వేలు కూడా రాదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట సాగు చేసిన తర్వాత ఊడలు దిగే సమయంలో వర్షాలు రాకపోవడంతో దిగుబడి తగ్గడానికి ప్రధాన కారణంగా మారింది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం వేరుశనగ రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాల్సిన అవసరం ఉంది.



అమరాపురం మండలం ఉప్పార్లపల్లిలో సాగు చేసిన వేరుశనగ పంట

ప్రభుత్వమే ఆదుకోవాలి



ఖరీఫ్‌లో రెండెకరాల విస్తీర్ణంలో వేరుశనగ పంట సాగు చేశా. రూ.30 వేలు ఖర్చు అయింది. అది కూడా బ్యాంక్‌లో నగలు తాకట్టు పెట్టి అప్పు తీసుకువచ్చి పంట పెట్టాను. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవడంతో అప్పు చేయాల్సి వచ్చింది. అయితే ప్రస్తుతం వేరుశనగ పంట దిగుబడి ఏమాత్రం లేదు. చెట్లలో 10 నుంచి 15 వరకే కాయలు ఉన్నాయి. దీంతో రూ.10 వేలు కూడా వచ్చే పరిస్థితిలేదు. కూటమి ప్రభుత్వం వేరుశనగ రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

– బడప్ప, ఆర్‌గొల్లహట్టి, రొళ్ల మండలం

అప్పు చేసి పంట సాగు చేశా..



ఖరీఫ్ ప్రారంభంలో కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించలేదు. దీంతో రూ.30 వేలు అప్పు చేసి ఒకటిన్నర ఎకరాలో వేరుశనగ పంట సాగు చేశాను. అయితే దిగుబడి నామమాత్రంగా ఉంది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. చేసిన అప్పును తిరిగి చెల్లించడానికి ఇబ్బంది పడాలి. కూటమి ప్రభుత్వం జాప్యం చేయకుండా వేరుశనగ రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

– దేవరాజు, రత్నగిరి, రొళ్ల మండలం

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పెంపు

పుట్టపర్తి అర్బన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఏపీఓఎస్ఎస్) ద్వారా 2025–26 సంవత్సరానికి సంబంధించి పది, ఇంటర్ తరగతుల్లో అడ్మిషన్ పొందడానికి అపరాధ రుసుముతో కలిపి అక్టోబర్ 31 వరకూ గడువు పొడిగించినట్లు డీఈఓ కిష్టప్ప ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతిలో చేరేందుకు 14 సంవత్సరాలు నిండాలని, ఇంటర్‌లో చేరడానికి 15 ఏళ్ల పైన ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తి ఉన్న అభ్యాసకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

భూసేకరణ వేగవంతం చేయండి

- కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్



పుట్టపర్తి: అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

ప్రశాంతి నిలయం: జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారులు, పారిశ్రామిక, సోలార్ ప్రాజెక్టుల భూసేకరణ పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాలులో జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారులు, సోలార్, ఏపీఐఐసీ ప్రాజెక్ట్‌లకు సంబంధించిన భూసేకరణ ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. రాష్ట్రంలో 'భారత్ మాల పరియోజన 'ఫేజ్–1లో భాగంగా బెంగళూరు–కడప–విజయవాడ ఎకనామిక్ కారిడార్‌లో జిల్లాలోని కోడూరు నుంచి ఒద్దులపల్లి వరకూ ఆరులేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే అభివృద్ధిపై చర్చించారు. భూసేకరణ పనులు పెండింగ్‌లో ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పనులు, భూసమస్యలపై తక్షణ చర్యలు తీసుకొని పనులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రామగిరి సోలార్ పార్క్‌ను ప్రధాని మోదీ త్వరలోనే వర్చువల్‌గా ప్రారంభించే అవకాశం ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓలు సువర్ణ, మహేష్, వీవీఎస్ శర్మ, ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

పుట్టపర్తి అర్బన్: జిల్లా పరిధిలోని జాతీయ రహదారుల పనులను నవంబర్ మొదటి వారంలో పూర్తి చేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జాతీయ రహదారుల పురోగతిపై క్షేత్రస్థాయిలో పర్యటన చేశారు. పుట్టపర్తి మండలం జగరాజుపల్లి, గంటల మారెమ్మ గుడి వద్ద, గువ్వలగుట్టపల్లి తదితర చోట్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారుల పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పుట్టపర్తి నుంచి కోడూరు వరకూ 46.76 కిలోమీటర్ల నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులు ప్రస్తుతం 72 శాతం పూర్తయ్యాయిని తక్కిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సత్యసాయి బాబా శత జయంతి వేడుకలకు దేశ విదేశాల నుంచి భక్తులు వస్తారని దానికి సంబంధించిన అన్ని పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట జాతీయ రహదారుల డీఈ గిడ్డయ్య, జేఈ కావ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దోమల నియంత్రణ చర్యలు చేపట్టండి


సమీక్షిస్తున్న డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం

పుట్టపర్తి అర్బన్: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం ఆదేశించారు. మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. దోమల నివారణ కోసం స్ప్రేయింగ్, ఫాగింగ్ వంటి కార్యక్రమాలు వెంటనే చేపట్టాలన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బందితో కలిసి పని చేయాలన్నారు. తాగునీటిలో క్లోరినేషన్ చేయించాలని, ట్యాంకుల్లో నీటి శాంపిళ్లను తీసి పరీక్షించాలని, ఇంటింటికీ తిరిగి జ్వరాల సర్వే చేయాలని, దోమల లార్వాల పని పట్టాలని, ప్రతి శుక్రవారం డ్రైడే చేపట్టాలని ఆదేశించారు. మలేరియా, డెంగీ అనుమానిత కేసులకు రక్త పరీక్ష చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం

చిలమత్తూరు: ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం వైద్యులు, సిబ్బందిని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆమె చిలమత్తూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, ఓపీ ఎంట్రీలలో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. గర్భిణులకు వైద్య పరీక్షలను రెగ్యులర్‌గా చేయించాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా చూడాలని, ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి లావణ్య, ఆయుష్ వైద్యురాలు రోజా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తేలేస్తున్న గుడ్లు



- అంగన్‌వాడీ కేంద్రాలపై రాబంధులు
- చిన్న సైజు గుడ్ల సరఫరాతో భారీ దోపిడీ
- కాంట్రాక్టర్లకు టీడీపీ ప్రజాప్రతినిధుల మద్దతు

సాక్షి, పుట్టపర్తి: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని ఐదేళ్లలోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కింద అందించే కోడిగుడ్ల సరఫరా అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా నిలిచినా పట్టించుకునేవారు కరువయ్యారు. కోడిగుడ్డు బరువు 50 గ్రాములకు తగ్గకుండా ఉండాలి. అలాంటి గుడ్లను అంగన్‌వాడీలకు సరఫరా చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయి. అయితే కాంట్రాక్టర్లు తక్కువ పరిమాణం కలిగిన చిన్న సైజు గుడ్లను సరఫరా చేస్తున్నారు. అధికారుల తనిఖీలు అంతంత మాత్రంగానే ఉండటంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తూ.. 'మా వెనుక ఎమ్మెల్యే ఉన్నారం'టూ కాంట్రాక్టర్లు బెదిరింపులకు దిగుతున్నారు. రాజకీయ నాయకులకు మామూళ్లు ఇవ్వాల్సి ఉన్నందున చిన్నసైజు గుడ్లు సరఫరా చేస్తేనే తమకు గిట్టుబాటు అవుతుందని కాంట్రాక్టర్లు స్పష్టం చేస్తున్నారు.

ప్రాంతాల వారీగా పంచుకుని..

జిల్లాలోని 32 మండలాల పరిధిలో 2,824 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 21 మండలాలకు ఒకరు, మిగతా మండలాలకు మరొకరు కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు. ఆ ఇద్దరి నుంచి ప్రతి నెలా ఆయా నియోజకవర్గ ప్రజాప్రతినిధులు 'సుంకం' విధించారు. ముందుగా గుడ్డుకు ఇంత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ కాంట్రాక్టర్లు ససేమిరా అనడంతో ఒక్కో నియోజకవర్గంలో నెలకు రూ.2 లక్షలు చొప్పున ఇవ్వాల్సి వస్తోంది. కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల మధ్య సయోధ్య లేకపోవడంతో అందరికీ కమీషన్ ఇవ్వాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. అడిగిన సమయంలో ఇవ్వకుంటే కాంట్రాక్టు తీసేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు.



ఒక ట్రేలో 30 కోడిగుడ్లు ఉంటాయి. ట్రేబరువు 100 గ్రాములు కలిపితే మొత్తం 1,600 గ్రాములు రావాలి. కానీ మొత్తం 1,400 గ్రాములకే తూగుతున్నాయి. జిల్లా కేంద్రం పుట్టపర్తి మున్సిపాలిటీ ప్రశాంతి గ్రాంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఈ విచిత్రం వెలుగు చూసింది. చిన్న సైజు గుడ్లు ఎందుకు ఇస్తున్నారని సిబ్బందిని ప్రశ్నిస్తే.. కాంట్రాక్టర్లు ఇచ్చిన వాటినే సరఫరా చేస్తున్నామని సమాధానం చెబుతున్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

కేటగిరీల వారీగా కమీషన్లు

ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల కమీషన్లు పక్కనబెడితే.. కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లు, రవాణా చేసే వారు.. పంపిణీ చేసే వారు సైతం ఎవరికి వారుగా గుడ్లలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీంతో కమీషన్ల గోలలోనే గుడ్లన్నీ చిన్నబోతున్నాయి. గుడ్ల సరఫరా అంటే కొనుగోలు, సరఫరా రెండూ కాంట్రాక్టరువే. కానీ సరఫరా చేసే కాంట్రాక్టరును బెదిరించి మండలానికి ఒకరు చొప్పున రవాణా కాంట్రాక్టును పార్టీ నేతలకు ఇప్పించారు. దీంతో రవాణాలో జాప్యం జరిగినా ప్రశ్నించే వారు లేరు.

ఫిర్యాదులు వస్తే తనిఖీలు

అంగన్‌వాడీ కేంద్రాలకు నిబంధనల మేరకే కోడిగుడ్లు సరఫరా చేయాలని చెబుతున్నాం. ఎక్కడైనా చిన్న సైజు గుడ్లు ఉన్నట్లు ఫిర్యాదులు వస్తే తప్పకుండా తనిఖీలు చేస్తాం. నిబంధనలకు విరుద్ధంగా పంపిణీ చేస్తున్న కాంట్రాక్టర్లపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. – ప్రమీల, ఐసీడీఎస్ పీడీ

కాంట్రాక్టరు ఒకరు.. సరఫరా ఇంకొకరు..

కోడిగుడ్ల సరఫరాకు టెండరు వేసింది కాంట్రాక్టరు.. కానీ సరఫరా చేసేది కూటమి నేతలు. టెండరు నువ్వు వేసినా మేమే సరఫరా చేస్తాం అంటూ తెగేసి చెబుతున్నారు. దీంతో సదరు కాంట్రాక్టరు సరఫరా వదిలేశారు. టీడీపీ నేతలే సరఫరా చేస్తుండటంతో గుడ్లు వస్తున్నాయా లేదా? సైజు ఎంత ఉంది అని ప్రశ్నించే వారు కరువయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా చేయని ఘటన ఇటీవల కొత్తచెరువులో వెలుగు చూసింది.

చీనీ, టమాట మార్కెట్ల పరిశీలన


టమాట మండీని పరిశీలించిన ఉద్యానశాఖ డీడీ ఉమాదేవి, అగ్రివాచ్ సంస్థ ప్రతినిధి హిమయుద్దీన్

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ పరిస్థితులు తెలుసుకునేందుకు ఉద్యానశాఖ డీడీ ఉమాదేవి, అగ్రివాచ్ సంస్థ ప్రతినిధి హిమయుద్దీన్ తదితరులు మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో చీనీ మార్కెట్, కక్కలపల్లి టమాటా మండీలను పరిశీలించారు. జిల్లాలో సాగులో ఉన్న పంటల విస్తీర్ణం, దిగుబడులు, మార్కెట్ ధరలు, రైతుల కష్టనష్టాలు, ట్రేడర్ల పరిస్థితి గురించి తెలుసుకున్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చూడాలని ట్రేడర్లకు సూచించారు. ప్రస్తుతం చీనీ, టమాట ధరలు కాస్త నిలకడగానే కొనసాగుతున్నట్లు తెలిపారు. ధరల్లేక రోడ్డున పడేసే పరిస్థితి తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అలాంటి పరిస్థితి ఉంటే ముందస్తు సమాచారం ఇవ్వాలని ట్రేడర్లు, మండీ నిర్వాహకులకు సూచించారు. పరిశీలనలో ఉద్యానశాఖ ఏడీ దేవానంద్‌కుమార్, ఏపీఎంఐపీ ఏపీడీ ధనుంజయ, హెచ్‌ఓ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిలమత్తూరు: టేకులోడు అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న 8 మందిని మంగళవారం సాయంత్రం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.10,500 నగదు, 8 మంది ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.

చిన్నారులపై కుక్క దాడి

రొద్దం: మండల కేంద్రంలోని పోలేపల్లి వీధి సమీపాన మంగళవారం ముగ్గురు చిన్నారులపై కుక్కదాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. వెంటనే వీరిని పావగడ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఇదే కుక్క సోమవారం కూడా మరో ముగ్గురిపై కూడా దాడిచేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

హిందూపురం టౌన్: హిందూపురం ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలుచోట్ల దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి 192 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు పృథ్వీ, ఫరూక్, నారాయణస్వామి, హెచ్‌సీ నరసింహ, వెంకటేష్, రమణ, సతీష్, పీసీలు అంజి, రవీంద్ర, కుమార్, రంగధామ్, శివ, సుధాకర్ రెడ్డి, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలపై అర్ధనగ్న నిరసన


అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

పుట్టపర్తి అర్బన్: నిరుద్యోగుల సమస్యలపై ఏఐవైఎఫ్ నాయకులు పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం వద్ద అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న వేలాది పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగ సమస్యపై కూటమి ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3 వేలు భృతి అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాక్ పోస్టులను భర్తీ చేయకపోవడం అన్యాయమన్నారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలన్నారు. వెంటనే మంత్రివర్గ కమిటీ ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. అనంతరం ఆర్డీఓ సువర్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సకలా రాజా, జిల్లా కార్యదర్శి కమల్‌బాషా, జిల్లా నాయకులు ప్రవీణ్ ఫైరోజ్, జీలాన్‌ఖాన్, గోవర్ధన్, ఇమ్రాన్, జిలాన్‌బాషా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో లారీ దగ్ధం


మంటలను ఆర్పుతున్న మెకానిక్‌లు

హిందూపురం: హిందూపురంలోని ఆటోనగర్ వద్ద మంగళవారం ఆగి ఉన్న లారీలో బ్యాటరీ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. మెకానిక్‌లు గమనించి నీటితో చల్లి మంటలు ఆర్పివేశారు. లారీ పూర్తిగా దెబ్బతింది.

గుజిరీలో భారీ అగ్ని ప్రమాదం


గుజిరీ గోడౌన్‌లోంచి ఎగిసిపడుతున్న మంటలు

హిందూపురం: పట్టణంలోని బెంగళూరు రోడ్డు టీచర్స్‌కాలనీ వద్ద గుజిరీ గోడౌన్‌లో మంగళవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. సర్వీసింగ్ సెంటర్‌లో షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు చెలరేగి పక్కనే ఉన్న గుజిరీ సామాన్లకు వ్యాపించాయి. దీంతో గుజిరీ గోడౌన్‌లో మంటలు పూర్తిగా ఎగిసిపడ్డాయి. సమీపంలోనే ఉన్న పెద్ద భవనం మంటల తాకిడికి నెర్రెలు చీలింది. సమాచారం అందుకుని సంఘటన స్థలానికి చేరుకున్న ఫైరింజన్ సిబ్బంది మంటలు ఆర్పడానికి ప్రయత్నించారు. కొంతసేపటికే నీరు అయిపోవడంతో.. ఫైరింజన్ వెళ్లి నీటిని నింపుకొని వచ్చేసరికి చాలావరకు మంటలు వ్యాపించాయి. గౌడౌన్ లోపలి నుంచి మంటలు ఎగిసి పడుతుండటంతో అదుపు చేయడానికి సిబ్బంది చాలా శ్రమించాల్సి వచ్చింది. నివాస గృహాల మధ్య కారు సర్వీసింగ్‌లు, గుజిరీ గౌడౌన్లకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వడం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని ప్రజలు విమర్శించారు. అగ్నిప్రమాదం కారణంగా బెంగళూరు రోడ్డులో వాహనాల రాకపోకలు స్తంభించి, ట్రాఫిక్ జామ్ అయ్యింది.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని మారెంపల్లి కాలనీలో అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న పక్కీరప్ప అనే వ్యక్తిని మంగళవారం కళ్యాణదుర్గం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతని వద్ద నుంచి 48 ప్యాకెట్ల కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే అనంతపురం ఎక్సైజ్ పోలీసులు పాలవాయి గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న బాలాజీ నాయక్‌ను అరెస్టు చేసి, 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ సోమశేఖర్, అన్నపూర్ణ, ఎస్‌ఐలు హరికృష్ణ, శంకరనారాయణ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు పాన్ కార్డులు కలిగి ఉండటం నేరం


మాట్లాడుతున్న ఐటీఓ కిరణ్‌కుమార్

గుంతకల్లు: ఒక వ్యక్తి రెండు పాన్ (పర్మినెంట్ అకౌంట్ నంబర్) కార్డులు కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ (ఐటీఓ) కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. అలా ఎవరైనా రెండు పాన్‌లు కలిగి ఉంటే రూ.10 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలోని మీటింగ్ హాలులో గుంతకల్లు చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆధార్‌కార్డుతో పాన్ కార్డు అనుసంధానం వల్ల కలిగే లాభాలు, నష్టాలు, ప్రస్తుత ఐటీ రిటర్న్స్‌లో కొత్త నిబంధనలు, మార్పులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి చాంబర్ ఆఫ్ కామర్స్ పట్టణ అధ్యక్షుడు గోపా జగదీష్ అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథులుగా ఐటీఓతోపాటు ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ హాజరై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి కందూరి కృపాకర్, నాయకులు పసుపుల హరిహరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బలిజ, కాపు కులాలపై చిన్నచూపు


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చందూజనార్దన్

- రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందూజనార్దన్

పుట్టపర్తి టౌన్: బలిజ, కాపు కులాలను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందూజనార్దన్ విమర్శించారు. రాయలసీమ పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీకృష్ణదేవ రాయలు వంశంగా ఉన్న బలిజల్లోకి దొమ్మెరలను 'గిరి బలిజలు'గా కూటమి ప్రభుత్వం చేర్చడం తగదన్నారు. జీఓ 5ను వెంటనే రద్దు చేసి.. గిరి బలిజలను 'బలిజ' కులంలోంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడు రామకృష్ణ, వినియోగదారుల సంఘం ప్రధాన కార్యదర్శి నరేష్‌కుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్, నాయకులు పెనుమూరి కుమార్, హరిరాయల్, సరేష్‌బాబు, బాలగంగాధర్, బొగ్గరం శ్రీనివాసులు, రామాంజనేయులు, శ్రీనివాసులు, మల్లికార్జున, వెంకటేష్, కరుణాకర్, చిట్టిబాబు, మంజునాథ్, గంగాధర్, వెంకటాద్రి శంకర్ తదితరలు పాల్గొన్నారు.

నిడిమామిడిలో 'రాజగురువు' శాసనం


శాసనాన్ని చూపుతున్న చరిత్రకారుడు మైనాస్వామి

పుట్టపర్తి అర్బన్: నిడిమామిడిలో శ్రీశైల జగద్గురు నిడిమామిడి సంస్థానంలో బసవన్న (నంది) విగ్రహాన్ని ప్రతిష్ఠించిన విషయాన్ని తెలియజేసే శాసనాన్ని చరిత్రకారుడు మైనాస్వామి మంగళవారం గుర్తించారు. కాళయుక్తి సంవత్సరం శ్రావణ మాసంలో శ్రీశైల జగద్గురు బసవరాజ మహాదేవ సజీవ సమాధిపై నాటి రాజగురువు మహా మండలాచార్య శ్రీచంద్రభూషణదేవ మహాచార్య బసవన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు శాసనంలో పొందుపరిచారని పేర్కొన్నారు. ఇంగ్లీష్ తేదీల ప్రకారం నంది విగ్రహ ప్రతిష్ఠ సామాన్య శకం 1438 ఆగస్టులో జరిగిందని వివరించారు. చిన్న రాతి పలకపై తెలుగులో శాసనాన్ని రాయగా.. పై భాగంలో నంది శిల్పాన్ని సుందరంగా మలిచారని తెలిపారు. విజయ నగర సామ్రాజ్య చక్రవర్తి రెండో దేవరాయలు (1424–1446) కాలంలో జగద్గురు నిడిమామిడి సంస్థానాధిపతి మహా మండలాచార్య శ్రీచంద్రభూషణ దేవ మహాచార్య రాజగురువుగా పని చేశారన్నారు. శ్రీచంద్రభూషణదేవ నిడిమామిడి నుంచి పెనుకొండకు, అక్కడి నుంచి హంపికి వెళ్లి రాజ గురువుగా వ్యవహరించినట్లు చరిత్రకారుడు పేర్కొన్నారు.

- విజయ నగర సామ్రాజ్య స్థాపనలో విద్యారణ్య స్వామి రాజగురువుగా కీలక పాత్ర పోషించగా.. శ్రీకృష్ణ దేవరాయలు (1509–1529)పాలనలో వ్యాసరాయలు రాజగురువుగా ఉన్నారు. కానీ నిడిమామిడి శాసనం ప్రకారం చంద్రభూషణదేవ రాజగురువుగా విజయ నగర సామ్రాజ్యంలో కొనసాగినట్లు తెలుస్తోందని మైనాస్వామి చెప్పారు. వెయ్యి సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన శ్రీశైల జగద్గురు నిడిమామిడి సంస్థానం మూల మఠం సరైన ఆదరణకు నోచుకోలేదన్నారు. దీనికి అత్యంత విలువైన ఆస్తులు ఉన్నాయన్నారు. మఠానికి చెందిన వీరభద్రస్వామి గుడి పునఃనిర్మాణం జరిగినా కొన్ని వివాదాలతో గుడి మూతపడడం బాధాకరమన్నారు. ఆయన వెంట విశ్రాంత హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, ఆలయ పూజారి వీరభద్రప్ప ,మహేష్ తదితరులు ఉన్నారు.

తల్లిపాలదానంలో చరిత్ర 'లిఖిత'ం


దర్శి లిఖితను సన్మానిస్తున్న డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, నవజాత శిశువుల తల్లులు

అనంతపురం మెడికల్: బిడ్డ ఆకలి తీర్చే ప్రతి మహిళా అమ్మే. కళ్లు కూడా తెరవని పసి కూనలు ఆకలితో అమ్మ స్తనమందుకున్నా పాలు రాకపోతే.. ఆ బిడ్డల పరిస్థితి ఊహించలేం. ఆ తల్లిపడే వేదన వర్ణించలేం. ఇలా ఎందరో మహిళలు ప్రసవం అయ్యాక సకాలంలో పాలుపడక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారికి 'దర్శి లిఖిత' అమ్మలా మారారు. పాలుపడక ఎటూపాలుపోని స్థితిలో ఉన్న తల్లులకు అండగా నిలిచారు. వేలాది మంది బిడ్డలకు పాలిచ్చి ప్రాణాలు పోశారు.

ఇప్పటివరకు 45 లీటర్ల పాలదానం

అనంతపురానికి చెందిన దర్శి లిఖిత బెంగళూరులోని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఇండియా మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న ఓ బిడ్డకు జన్మనిచ్చారు. సకాలంలో పాలు పడక బిడ్డకు డబ్బాపాలు పట్టారు. ఆ సమయంలో ఆమె తీవ్ర మనోవేదనకు గురయ్యారు. అనంతరం ఆ సమస్యను అధిగమించారు. పొత్తిళ్లలోని బిడ్డకు పాలివ్వలేని స్థితిలో తనలా ఎందరో తల్లులు బాధపడుతున్నారని తెలిసి చలించిపోయారు. ఈ క్రమంలోనే తన వంతుగా తల్లిపాలను దానం చేయాలని భావించారు. అనంతపురం సర్వజనాస్పత్రిలో 'మదర్ మిల్క్ బ్యాంకు'కు ఇప్పటికే 31 లీటర్ల పాలను ఇచ్చారు. తాజాగా మంగళవారం మరో 14 లీటర్ల పాలను సర్వజనాస్పత్రిలోని మదర్ మిల్క్ బ్యాంకుకు అప్పగించారు. ఇప్పటి వరకు ఆమె 45 లీటర్ల తల్లిపాలను మిల్క్ బ్యాంకుకు అందించడం విశేషం. దీంతో మంగళవారం ఆస్పత్రిలో దర్శి లిఖితను డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అక్కడ పాల కోసం వేచి ఉన్న తల్లులు దర్శి లిఖితకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం డిప్యూటీ ఆర్‌ఎంఓ హేమలత మాట్లాడుతూ... దర్శి లిఖిత ఔదార్యం ఎంతో మందికి ఆదర్శమన్నారు. తనకు తెలిసి రాష్ట్రంలోనే ఎక్కడా ఇలా ఈ స్థాయిలో తల్లిపాలను ఇచ్చి ఉండరని తెలిపారు. పాలు పట్టక ఇబ్బంది పడుతున్న తల్లుల కంటతడి తుడిచేందుకు మదర్‌మిల్క్ బ్యాంక్ ద్వారా పాలను అందించేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యూట్రీషయనిస్టు పల్లవి, కౌన్సిలర్ రాధ, స్టాఫ్‌నర్సు రమ, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రమేష్‌నారాయణకు 'కీర్తి' పురస్కారం


పురస్కారమందుకుంటున్న డాక్టర్ పతికి రమేష్ నారాయణ

అనంతపురం కల్చరల్: తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మకంగా అందించే 'కీర్తి పుస్కారం' అనంతపురానికి చెందిన ప్రసిద్ధ సాహితీ–విద్యావేత్త డాక్టర్ పతికి రమేష్‌నారాయణ అందుకున్నారు. మంగళవారం హైదరాబాదులోని ఎన్టీఆర్ కళామందిరంలో జరిగిన ప్రదానోత్సవ సభలో యూనివర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు, శాంతా బయోటెక్స్ వ్యవస్థాపకుడు పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాదరెడ్డి, తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక వసతుల కార్పొరేషన్ ఎండీ గణపతిరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంత సాహితీక్షేత్రంలో బహుగ్రంథకర్త గానే కాకుండా అనువాదరంగంలో విశేష ప్రతిభాపాటవాలతో జనచైతన్యం చేస్తున్నందుకు కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారన్నారు. ప్రిన్సిపాల్‌గా, రచయితగా, సామాజికవేత్తగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయనకు లోతైన జ్ఞానం ఉందని కొనియాడారు. పురస్కారమందుకున్న డాక్టర్ రమేష్‌నారాయణను డాక్టర్ ఉమర్‌ఆలీషా ప్రతినిధులు రియాజుద్దీన్, షరీఫ్, సాహిత్యభారతి జిల్లా అధ్యక్షుడు గుత్తా హరి, కార్యదర్శి తోట నాగరాజు, సుంకర రమేష్ అభినందించారు. జిల్లాకు ప్రత్యేక గౌరవం తెచ్చారన్నారు.

యూరియా కొరత తీరేదెన్నడు?


తోపుదుర్తిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఆత్మకూరు: రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. కావాల్సినంత యూరియా అందివ్వడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. మంగళవారం తోపుదుర్తి గ్రామంలోని రైతు సేవ కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. గంటల తరబడి లైన్‌లో పడిగాపులు కాసి యూరియా తీసుకెళ్లారు. మండలంలో మదిగుబ్బ, సింగంపల్లి, సనప, బి.యాలేరు, తోపుదుర్తి గ్రామాల్లో యూరియా కొరత ఎక్కువగా ఉంది. అవసరానికి తగ్గట్టు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

మహాలక్ష్మి ITI

■ ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, ప్లంబర్ ట్రేడ్ లకు అడ్మిషన్లకై సంప్ర: రాచంరెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్, బస్టాండ్ ఎదురుగా, ATP. 99892376326. [A-1689]

అడ్మిషన్స్

■ B.Sc (MLT), B.P.T (ఫిజియోథెరపీ) కోర్స్ కి గవర్నమెంట్ సీట్స్ కలవు. ఫ్రీ ఎడ్యుకేషన్, ఫ్రీ హాస్టల్. అర్హత: ఇంటర్మీడియట్‌లో Bi.P.C పాస్ (లేదా) Any ఒకేషనల్ గ్రూప్‌తో పాటు బ్రిడ్జి కోర్స్ పాస్. Contact: G.MURALI, 9030661651, అనంతపురము. [A-7191]

REAL ESTATE

LAND FOR SALE

■ అనంతపురం నుంచి 18 కి.మీ. దూరంలో, సనప దగ్గర 4.50 ఎకరాలు భూమి ఉన్నది. 1 ఎకరం 20 లక్షలు, నో బ్రోకర్స్, కాంటాక్ట్ డైరెక్ట్ ఓనర్ : 62811 58454. [A-1692]

WANTED

■ కంప్యూటర్ ఆపరేటర్ (స్త్రీలు) కావలెను. Q: ఏదైనా డిగ్రీ, జీతం : 12వేలు, EPF & ESI కలదు. EXP : 2 సం: Tally వచ్చినవారికి మాత్రమే ప్రాధాన్యత. సెల్: 9848524061. [SCA25008319]

■ అనంతపురంలో ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు 1సం. అనుభవం కల్గిన అకౌంటెంట్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్ర: 81251 69846 [SCA25008395]

■ అనంతపురంలో ప్రముఖ కంపెనీలో పని చేయుటకు రైతులతో పనిచేసిన అనుభవం ఉన్న ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్ర: 88855 78578. [SCA25008396]

■ డ్రైవర్స్ కావలెను. పర్మినెంట్ / డ్రైవింగ్ లైసెన్స్ EXP: 3 సం॥ Q: 10th పాస్/ఫెయిల్. ఏజ్: 20-35 లోపు. & టెంపరరీ డ్రైవర్స్‌కి DL EXP 2 సం॥: ఏజ్: 20-40లోపు. జీతం: 15,500+PF, ESIC, TA, OT, భోజనం కలదు. సెల్: 9066192421, 9390490947. [A-1691]

■ ప్రముఖ MNC, ఈ కామర్స్ వాటి అనుబంధ సంస్థలలో వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. అర్హత: 10th–డిగ్రీ, మంచి జీతం కలదు. సంప్రదించండి. 7975475904 [G-767]

■ చెదల నివారణ సంస్థలో పని చేయుటకు సర్వీస్ బాయ్స్ కావలెను. వెహికల్ తప్పని సరి, అర్హత : 10th, జీతం: రూ. 18,000/-, పెట్రోల్ చార్జ్ సపరేట్. ✆ 94945 69895. [B-838]

■ అనంతపురంలోని HAPYCAR రెంటల్ కంపెనీ ఫ్లీట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలను భర్తీ చేస్తోంది. అర్హతలు: కనీసం ఇంటర్ / డిగ్రీ పాస్, డ్రైవింగ్ లైసెన్స్, జీతం + incentives, సంప్రదించండి సెల్ : 6301174565, 8919042980. [SCA25008397]

■ SK బనాన ఎక్స్ పోర్టింగ్ కంపెనీ నందు పనిచేయుటకు ఫీల్డ్ & క్వాలిటీ సూపర్వైజర్స్ కావలెను,అర్హత:ఇంటర్ ఆపైన, ఇంటర్వ్యూ : సెప్టెంబర్ 28 @ 10 am To 5 pm. # సరిగమ రెస్టారెంట్ తాడిపత్రి. సెల్: 8095610250, 9381192556. [SCA25008393]

■ SS సెక్యూరిటీ & మ్యాన్ పవర్ సర్వీసెస్ నందు అనంతపురము లో పని చేయుటకు సెక్యూరిటి గార్డ్స్ & హౌస్ కీపింగ్ సిబ్బంది కావలెను. జీతం: 10-15 వేలు వరకు, వయసు: 25-50 సం॥లోపు. పని గంటలు: 8 నుండి 12 గం॥. సంప్ర : 9985985001, 7075513286, 7075513287. అడ్రస్: త్రివేణి థియేటర్ దగ్గర, అనంతపురం. [SCA25008255]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

4 లైన్లు రూ. 270/-
అదనపు లైను రూ. 60/-
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723, 9494767933
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185